పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని మారుమూల పంచాయతీల్లోని గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో కుమడ పంచాయితీ గుండ్రమెట్ట గ్రామంలో, బూసిపుట్టు పంచాయతీ సరియాపల్లి, బాబుసాల పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో భాగంగా సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ విధానాలపై గిరి రైతులు మొగ్గు చూపాలని సూచించారు కాఫీ, మిరియాలు సాగుపై అవగాహన కల్పిచారు. ఎరువుల యాజమాన్యం, చీడపీడల నుంచి పైర్ల సస్యరక్షణ, ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. మండల పశువైద్యాధికారిని సౌజన్య దేవి మాట్లాడుతూ పశుసంపద అభివృద్ధిలో పోషణ, టీకాల ఆవశ్యకత, నట్టల నివారణ వ్యాక్సినేషన్, పశువుల బీమా వంటివాటిపై వివరించారు. కార్యక్రమంలో .మినుముల పార్వతి, బాబుసాల ఎంపిటిసి ఎ.కిరణ్ కుమార్ గ్రామ వ్యవసాయ సహాయకులు, గాసిరాం గ్రామ ప్రకృతి వ్యవసాయ సహాయకులు శ్రీనివాస రెడ్డి, కాఫీ లైజన్ వర్కర్ కిముడు రఘురాం గ్రామ పశువైద్య సహాయకులు, మూడు పంచాయతీల సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.

కోరెడ్ల విజయగౌరి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో విజయగౌరి

విద్యార్థి దశ నుంచే విద్యారంగ సమస్యలపై పోరాటం

పాఠశాలల మూసివేత, అక్రమ బదిలీలపై అలుపెరుగని ఉద్యమాలు

యుటిఎఫ్ మండల కార్యదర్శి నుంచి రాష్ట్ర స్థాయి నేతగా ఎదుగుదల

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

యుటిఎఫ్ (ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరెడ్ల విజయగౌరి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచారు. ఈ మేరకు విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఆమెను అభ్యర్థిగా ప్రకటించారు. వివిధ సంఘాలు ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరిచాయి. విజయగౌరి విద్యార్థి దశ నుంచే విద్యారంగ సమస్యలపై పోరాటం చేశారు. యుటిఎఫ్ సాధారణ కార్యకర్తగా చేరిన ఆమె అనతి కాలంలోనే జిల్లా, రాష్ట్ర నాయకురాలిగా ఎదిగారు. రేషనలైజేషన్ పేరిట పాఠశాలల కుదింపు, క్లస్టర్ పాఠశాలల విధానం వంటివాటిపై ఉద్యమాలు ముందుకు నడిపేందుకు చొరవ చూపారు. జిఒ నెంబర్ 72కి వ్యతిరేకంగా చేపట్టిన పోరాటంలో పోలీసులు అక్రమ కేసు బనాయించినా వెరవలేదు. 2017లో అక్రమ బదిలీలపై జరిగిన ఉపాధ్యాయుల ఆందోళన కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయ నేతగా నాయకత్వం వహించారు. అప్పట్లో పెట్టిన కేసు ఏడేళ్లపాటు నడిచింది. పేదలను విద్య నుంచి దూరం చేసే నూతన విద్యావిధానంపై జరిగిన పోరాటంలోనూ ఎంతో చురుకుగా పనిచేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్బంధాలు, బెదిరింపులు, కేసులు ఎదుర్కొన్నారు. 1996 నుంచి బొబ్బిలి ప్రాంతంలో యుటిఎఫ్ విస్తరణకు కృషి చేశారు. యుటిఎఫ్ బొబ్బిలి మండల తొలి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఆమె, అనంతరం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, రాష్ట్ర సహాధ్యక్షులుగా, ఎస్‌టిఎఫ్‌ఐ జాతీయ కార్యదర్శిగా పనిచేస్తూ యుటిఎఫ్ ఉద్యమాల్లోనూ, వివిధ ఉపాధ్యాయ సంఘాలను ఐక్యం చేయడంలోనూ కీలకపాత్ర పోషించారు. ప్రస్తుతం యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా చురుకైన పాత్రపోషిస్తున్నారు. మరోవైపు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఉపాధ్యక్షురాలిగా కూడా సేవలందిస్తున్నారు.

విద్యార్థి దశ నుంచే ప్రగతిశీల భావాలు

విజయగౌరి చిన్ననాటి నుంచే ప్రగతిశీల భావాలు గలవారు. ఆమె అన్నయ్య తిరుపతిరావు ప్రోత్సాహంతో హైస్కూల్‌లో చదువుతుండగానే ఎస్ఎఫ్ఐలో చేరారు. అప్పటికే విద్యారంగ సమస్యలపై పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు భవాని వెంట వెళ్లేవారు. అలా మొదలైన ఆమెలో నాయకత్వ లక్షణాలు చదువు పూర్తయ్యేవరకు ఎస్ఎఫ్ఎఫ్ నాయకురాలిగా కొనసాగేలా చేశాయి. కాలేజీ స్థాయి నుంచి ఎస్ఎఫ్ఐలో క్రియాశీలక కార్యకర్తగా, చురుకైన నాయకురాలిగా పనిచేశారు. ఉపాధ్యాయ వృత్తిలో చేరాక భారత జ్ఞాన విజ్ఞాన సమితి వేదికలో 1992 నుంచి 1995 వరకు వందలాది గ్రామాల్లో అక్షరాస్యతా శాతం పెంపునకు కృషి చేశారు. ఆ తరువాత జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగానూ, అక్షరాస్యత ఆవశ్యకత గురించి కొన్ని గ్రామాల్లో మూడు నెలల పాటు 20 మంది యువతులతో ప్రచారోద్యమం చేపట్టారు. మరోవైపు సమతా కళాజాత నిర్వహణ కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తూ 1994 నుంచి 1996 వరకు సారా వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ తరువాత జన విజ్ఞాన వేదిక ఏర్పాటు, సైన్స్ ఉద్యమాన్ని బొబ్బిలి ప్రాంతంలో కీలకంగా నడిపారు. ఈ క్రమంలో 72 గిరిజన గ్రామాల్లో పర్యటించి, గిరిజన స్థితిగతులు, ఆ ప్రాంతంలోని విద్యారంగ సమస్యలపై అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి ఎనలేని కృషిచేశారు. ఆ ఉద్యమ ఫలితంగా జిల్లాలో మూతపడిన 12 ప్రభుత్వ పాఠశాలలను తిరిగి తెరవడంతోపాటు కొత్తగా మూడు పాఠశాలలు ఏర్పాటయ్యాయి.

ఒపిఎస్ పునరుద్ధరణ ఆందోళనలో యుటిఎఫ్ నేతలతో విజయగౌరి (ఫైల్‌ఫొటో)

ఇదీ కుటుంబ నేపథ్యం

విజయగౌరి తండ్రి సంజీవి నాయుడు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఈ ప్రభావం కుటుంబంపై ఉండడంతో అన్నదమ్ములు, అక్కచెల్లెలు అంతా ఉన్నత చదువులు అభ్యసించిన వారే. అంతకు మించి ప్రగతిశీల భావాలు గలవారు. ఉమ్మడి విజయనగరంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలను ఏకతాటిపైకి తీసుకొస్తూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేసిన కీర్తిశేషులు కె.శేషగిరి మాస్టారు ఈమెకు స్వయాన తమ్ముడు. అన్న తిరుపతిరావు కూడా అభ్యుదయ భావాలగల వ్యక్తి. ఇంజినీరుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. చెల్లెలు రమాప్రభ సామాజిక కార్యకర్తగా పనిచేస్తూ పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. విశాఖ కేంద్రంగా చిల్డ్రన్స్ క్లబ్ నడుపుతున్నారు. విజయగౌరి భర్త సత్యంనాయుడు కూడా ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. సుదీర్ఘకాలంగా జనవిజ్ఞాన వేదికలో పని చేస్తున్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు మాటకు కట్టుబడి

జిఒ3కి చట్టబద్ధత కల్పించాలి

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర
- గిరిజన ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి
- గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీల ఆవేదన దీక్ష

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: జిఒ3కు చట్టబద్ధత కల్పించి, గిరిజన ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర.జిల్లా కార్యదర్శి పి బాలదేవ్ డిమాండ్ చేశారు. మంగళవారం గిరిజన ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆదివాసీ ఆవేదన దీక్షల్లో కిల్లో సురేంద్ర, పొద్దు బాలదేవ్‌లతోపాటు సంఘం మండల అధ్యక్షులు జి.చిన్నబాబు పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ, ఈనెల 11 నుంచి నిర్వహించనున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో జిఒ 3 చట్టబద్ధతకు రాష్ట్రప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలకు సన్నాహాలు చేస్తోన్న నేపథ్యంలో దీని ద్వారా ఆదివాసీలకు న్యాయం జరగదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన నిరుద్యోగులకు సంపూర్ణ న్యాయం జరగాలంటే ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలన్నారు. అరుకులో నిర్వహించిన రా కదలిరా సభలో వేలాది మంది గిరిజనుల సమక్షంలో నాటి విపక్షనేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు జిఒ 3 చట్టబద్ధతకు హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటను నిలబెట్టుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు పి.నందో, పద్మాపురం మాజీ సర్పంచ్ ఎల్.మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

అరుకులో దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిసిన సురేంద్ర, బాలదేవ్ తదితరులు

ఆదివాసీ నిరుద్యోగులు, విద్యార్థుల నిరసన

అరకులోయ రూరల్: జిఒ3కు చట్టబద్ధతతో పాటు మెగా డిఎస్‌సితోపాటే ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, మంగళవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలోఅరకులోయలో గిరిజన నిరుద్యోగులు, విద్యార్థులు భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పొద్దు బాలదేవ్, మండల అధ్యక్షులు జి చినబాబు మాట్లాడుతూ, జిఒ3 చట్టబద్దతకు అరకులోయలో చంద్రబాబు ఇచ్చిన హామీ 11నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదన్నారు. ఈనెల 11 నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లోనే జిఒ 3కు చట్టబద్ధత కల్పించి, ఏజెన్సీలో ఉద్యోగాలను స్థానిక గిరిజనులకు వందశాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. త్వరలో విడుదల చేయనున్న మెగా డిఎస్‌సితోనే, గిరిజన ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు..గిరిజన గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో భోజన నిర్వహణ బాధ్యతలను అక్షయపాత్ర ఫౌండేషన్‌కు అప్పగించాలన్న ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు మగ్గన్న, నిరుద్యోగులు ప్రసాద్, కృష్ణ, రాజు, శిరలాల్, జానీబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడేరు: ఏజెన్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాల సాధన కోసం ఎపి అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం పాడేరు ఐటిడిఎ ఎదుట 48 గంటల ఆదివాసీల ఆవేదన దీక్ష ప్రారంభించారు. దీక్షలో పాల్గొన్న జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, ఆదివాసి జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖి శేషాద్రి మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం రూపొందించి లోకల్ క్యాడర్ ఉపాధ్యాయ పోస్టులన్నిటిని అర్హులైన ఆదివాసి అభ్యర్థులతో భర్తీ చేయాలనే డిమాండ్ చేశారు. ఏజెన్సీలోఉద్యోగ ఉపాధ్యాయ నియమకాల్లో స్థానిక ఆదివాసీలకే ఉద్యోగాలు చెందాలన్నారు. జిఒ3 పునరుద్ధరణ హామీ చంద్రబాబు అమలు చేయాలన్నారు.

అరుకులో నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు, విద్యార్థులు

పాడేరులో ఆదివాసీల ఆవేదన దీక్షలో పాల్గొన్న జెఎసి నేత శేషాద్రి

ఎస్ఇగా చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -సీలేరు

ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈ సివిల్‌గా చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఇ సివిల్‌గా పని చేసిన రామభద్రరాజును పోలవరం ప్రాజెక్టుకు ఇటీవల జెన్‌కో ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సీలేరు పంపు స్టోరేజ్ ప్రాజెక్ట్ ఎస్ఈ సివిల్‌గా కొనసాగుతున్న చంద్రశేఖర్ రెడ్డికి సీలేరు కాంప్లెక్స్ ఎస్ఇ సివిల్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఏపీ జెన్కో అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం చంద్రశేఖర్‌రెడ్డి స్థానిక ఎస్ఇ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్‌రెడ్డి

జల విద్యుత్ కేంద్రం మొదటి యూనిట్ మరమ్మతులు పూర్తి

ప్రజాశక్తి-సీలేరు : సీలేరు జల విద్యుత్ కేంద్రంలో మొదటి యూనిట్ మరమ్మతులు పూర్తయ్యాయని, సోమవారం, మంగళవారాల్లో యూనిట్ స్పిన్నింగ్‌లో పెట్టామని ఏపీ జెన్కో (ఓ అండ్ ఎం) ఈఈ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ సీలేరు జల విద్యుత్ కేంద్రంలో 60 మెగావాట్ల సామర్థ్యం గల నాలుగు యూనిట్లు ఉన్నాయని, అందులో మొదటి యూనిట్ ఆగస్టు 2న సాంకేతిక లోపాలు తలెత్తి మరమ్మతులు గురి కావడంతో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఏపీ జెన్కో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అభిరామ ఇంజనీరింగ్ కంపెనీకి మరమ్మతు పనులు అప్పగించమని తెలిపారు. సోమవారం సాయంత్రానికి మరమ్మతు పనులు పూర్తి కావడంతో అదే రోజు రాత్రి మొదటి యూనిట్ మెకానికల్ స్పిన్నింగ్‌లో పెట్టమన్నారు. యూనిట్ టెంపరేచర్ మేగ్గర్ వ్యాల్యూస్ సక్రమంగా ఉంటే మంగళవారం (శింకర్ నైజింగ్ చేసి) యూనిట్ పనితీరు క్షుణ్ణంగా పరిశీలించి అనంతరం విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించడానికి చర్యలు చేపడతామని ఈఈ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ఆగ్రో ఫారెస్ట్‌పై అవగాహన

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు పిఎన్‌పి గిరిజన మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆగ్రో ఫారెస్ట్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గిరిజన మిత్ర వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో అడవులను సంరక్షణ, వ్యవసాయం అభివృద్ధి చెందడానికి చేయవలసిన పనుల కోసం అవగాహన కల్పించారు. ఆక్సిజన్ పెరగడానికి ఏ రకమైన చర్యలు చేపట్టాలి, కార్బన్డయాక్సైడ్ నిర్మూలన చేయడానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై క్లుప్తంగా విద్యార్థులకు వివరించారు. వృక్షాలు పెంచడానికి విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. చెట్లను కాపాడే బాధ్యత మనపై ఉందన్నారు. రాబోయే రోజుల్లో వాతావరణం మార్పులు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పిఎన్‌పి సంస్థ సిబంది అరవింద్ కుమార్, శివ, రమేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గిరిజన మిత్ర వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ ఉదయ్ శ్రీనివాస్

భీష్మారావు ఆశయ సాధనకు కృషి

వర్థంతి సభలో సిపిఎం నేతలు పల్లపు వెంకట్, శరత్‌బాబు

ప్రజాశక్తి-చింతూరు

గిరిజనోద్యమ నేత, సిపిఎం నాయకులు అమరజీవి కామ్రేడ్ బత్తుల భీష్మారావు ఆశయాల సాధనకు ప్రతి కార్యకర్తా కృషి చేయాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్, తెలంగాణ రాష్ట్రం భద్రాచలం సిపిఎం నాయకులు బండారు శరత్ బాబు అన్నారు. కామ్రేడ్ బత్తుల భీష్మారావు 39వ వర్ధంతి కార్యక్రమం చింతూరు సిపిఎం కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. భీష్మారావు కుమారుడు బత్తుల లెనిన్, మాజీ జెడ్పిటిసి మొర్రం రంగమ్మ భీష్మారావ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పల్లపు వెంకట్, బండారు శరత్ బాబు మాట్లాడుతూ 1960 ప్రాంతంలో భద్రాచలం ఏజెన్సీలో గిరిజనులు అనేక రూపాల్లో దోపిడీకి గురయ్యారని, బిపిఎల్ వారు ఏజెన్సీ సంపద మొత్తం దోచుకుపోయేవారని, మేకల పుల్లరి పేరుతో ఫారెస్ట్ వారు గిరిజనులను అడవిలోకి వెళ్లనివ్వకుండా దాడులు చేసేవారని తెలిపారు. గిరిజనులు పండించే పంటలు, సేకరించే అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా మధ్య దళారులు దోపిడీ చేసే వారని పేర్కొన్నారు. ఇటువంటి సమయంలో చింతూరు కేంద్రంగా కామ్రేడ్ బత్తుల భీష్మారావు, శ్యామల వెంకటరెడ్డి, పులిరామయ్య తదితరులు ఎర్రజెండా నీడలో గిరిజనులను ఐక్యం చేసి అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ఈ పోరాటాల్లో గిరిజనులందరూ ఐక్యమై గ్రామాలు గ్రామాలు సిపిఎం జెండా వెనక్కి రావడంతో ఓర్వలేని రాడికల్స్ 1985 నవంబర్ 5వ తేదీన జీడిగొప్పు ప్రాంతంలో మాటువేసి చంపారని పేర్కొన్నారు. అమరవీరులు నిర్మించిన పార్టీని, ఇచ్చిన జెండాని నిలబెట్టుకుంటూ గిరిజనులు, గిరిజన ప్రాంతం అభివృద్ధికి అనేక పోరాటాలు చేసినట్లు చెప్పారు. నేడు కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో ఆ పార్టీ తొత్తు ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన ప్రాంత హక్కులు చట్టాలు కాలరాయబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో గిరిజన హక్కులు చట్టాలు రక్షించుకోవడానికి ఉద్యమాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బత్తుల భీష్మారావు కోడలు ప్రశాంతి, పెద్ద రాములు, లక్ష్మణ్, దిలీప్, రమేష్, నాగార్జున, నాగేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు వెంకట్, శరత్‌బాబు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు

సీలేరులో సినిమా షూటింగ్ సందడి

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. కొత్త కథానాయకులతో నిర్మిస్తున్న సినిమా షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా స్థానిక మారెమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారిపై తొలి షాట్‌ను చిత్రీకరించారు. ఈ సందర్భంగా సినిమా దర్శకుడు ఎం.వంశీకృష్ణ మాట్లాడుతూ సీలేరు బ్యాక్ డ్రాప్‌తో తెరకెక్కనున్న ఈ సినిమా పేరు మదము అని నామకరణం చేసినట్లు చెప్పారు. ఈ సినిమా ఎమోషనల్ రివేంజ్ డ్రామా అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కెమెరామెన్ రవికుమార్, ఎడిటర్ నందమూరి తారకరామారావు సీఈవో శాంతయ్యల ఆధ్వర్యంలో మారెమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సినిమాని సూర్యదేవా, రవీంద్రనాథ్, కోయ రమేష్ బాబు నిర్మిస్తున్నట్లు దర్శకుడు ఎం.వంశీకృష్ణ తెలిపారు. ఈ సినిమాలో గంగవరపు హర్ష, కటారి అనురుప్, లత, విశ్వనాథరెడ్డి నాయకా నాయకులుగా నటిస్తున్నట్లు వెల్లడించారు.

షూటింగ్‌లో పాల్గొన్న చిత్ర యూనిట్

అన్నం తిన్నాడని

మేనమామను హత్య చేసిన మేనల్లుడు

ప్రజాశక్తి- మోతుగూడెం

తన ఇంట్లో తనకు లేకుండా అన్నం తిన్నాడన్న కోపంతో మేనమామను చెక్కపీటతో మేనల్లుడు బలంగా కొట్టడంతో మేనమామ చనిపోయిన సంఘటన అల్లూరి జిల్లా, వై.రామవరం మండలం, డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధి మంగంపాడులో చోటుచేసుకుంది. డొంకరాయి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మంగంపాడు గ్రామానికి చెందిన మరిగెల అబ్బాయి రెడ్డి (41) ఆదివారం గ్రామంలో ఉన్న దెబో చికెన్ షాప్‌లో పనికి వెళ్లాడు. అక్కడే మధ్యాహ్నం 2.30గంటలు కావడంతో తన ఇంటికి వెళ్లి వంట చేసుకునే సమయం లేకపోవడంతో ఆకలిగా ఉన్న అబ్బాయిరెడ్డి అదే గ్రామంలో ఉంటున్న తన అక్క నైని లక్ష్మి ఇంటికి వెళ్లాడు. అక్క ఇంటి వద్ద లేకపోవడంతో పాటు ఇంట్లో అన్నం కూడా లేదు. దీంతో అదే ఇంట్లోని పక్క గదిలో ఉంటున్న తన అక్క కొడుకు నైని వెంకటరెడ్డి గదిలోకి వెళ్లాడు. ఆ సమయంలో తన మేనల్లుడు నైని వెంకటరెడ్డి, ఆయన భార్య ఎవరూ ఇంట్లో లేరు. ఇంట్లో కొద్దిగా ఉన్న అన్నం, కూరను అబ్బాయి రెడ్డి పెట్టుకొని తింటూ ఉండగా, అదే సమయంలో మేనల్లుడు వెంకటరెడ్డి కూలి పనికి వెళ్లి వచ్చాడు. తన ఇంట్లో అన్నం లేకపోవడంతో, తన మేనమామ ఆ అన్నం తింటూ ఉండటాన్ని చూసి ఆయనతో గొడవపడ్డాడు. ఉన్న కొద్ది అన్నం నాకు లేకుండా ఎందుకు తినేస్తున్నావంటూ మేనల్లుడు వెంకటరెడ్డి అక్కడే ఉన్న చెక్క పీటతో బలంగా అబ్బాయిరెడ్డి తలపై కొట్టాడు. దీంతో అబ్బాయి రెడ్డి తలకు బలమైన గాయం కావడంతో వెంటనే మంగంపాడు ఆసుపత్రిలో తీసుకెళ్లారు. అనంతరం చింతూరు హాస్పిటల్‌కి తీసుకెళ్లగా, మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి వైద్యులు రిఫర్ చేశారు. కాకినాడ తీసుకెళ్తుండగా, అబ్బాయి రెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో చింతూరు ప్రభుత్వ ఆస్పత్రికి తిరిగి తీసుకొచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం అబ్బాయి రెడ్డి మరణించారు. డొంకరాయి ఎస్సై శివకుమార్ కేసు చేశారు. చింతూరు సిఐ దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నారు.

రేషన్ డిపో ద్వారా పంచదార, కందిపప్పు అందలేదు

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం దారకొండ జిసిసి రేషన్ డిపో నుంచి పంచదార, కందిపప్పు వినియోగదారులకు అందరం లేదని గ్రామస్తులు ఆరోపించారు. దీనిపై అధికారులు సమగ్రమైన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గత నెల 16న ప్రభుత్వం మంజూరు చేసిన పంచదార, కందిపప్పు వినియోగదారులకు ఎండియు వాహనదారుడు పంపిణీ చేయలేదని పేర్కొన్నారు. ఎండియు వాహనదారుడు గ్రామ వీధుల్లో బియ్యం పంపిణీ చేసేటప్పుడు వినియోగదారుడు ఇంటి వద్ద లేకపోతే మళ్లీ వెళితే ఇచ్చే పరిస్థితి లేదని వాపోయారు. ఎండియు వాహనదారుడు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో తెల్ల రేషన్ కార్డు కలిగిన వినియోగదారులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నవంబర్ నెలలోనైనా జీసీసీ నుంచి పంచదార, కందిపప్పు వచ్చిందా? అడిగితే ఇంకా సరుకులు రాలేదని చెబుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిసిసి అధికారులు స్పందించి జిసిసి సేల్స్ మెన్, ఎండియు వాహనదారుడు వినియోగదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆందోళన చేస్తున్న గిరిజన గురుకుల విద్యార్థులు

అక్షయపాత్ర భోజనం వద్దే వద్దు!

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన గురుకుల విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి -జి.మాడుగుల : గిరిజన విద్యాలయాల్లో భోజన పథకం అమలును అక్షయపాత్ర ఫౌండేషన్‌కు అప్పగించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను వెంటనే వెనక్కు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా కార్యదర్శి జీవనకృష్ణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీఆధ్వర్యంలో స్థానిక గురుకుల విద్యార్థులు రోడ్డెక్కారు.

ఈ సందర్భంగా జీవనకృష్ణ మాట్లాడుతూ, ఏజెన్సీలో గిరిజన విద్యాలయాల్లో కనీస మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు నాలుగు నెలల్లో 16మంది విద్యార్థులు మరణించారన్నారు. ఈ నేపథ్యంలో గిరిజన విద్యార్థుల మరణాల నివారణకు చర్యలు, గిరి విద్యాలయాల్లో అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టకుండా భోజన నిర్వహణ బాధ్యతలను అక్షయపాత్ర ఫౌండేషన్‌కు అప్పగించి చేతులు దులుపుకోవాలన్న ప్రభుత్వ నిర్ణయం దుర్మార్గమని, దీన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇది గిరిజన విద్యార్థులను చదువుకు దూరం చేయడమేనన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో హెల్త్ అసిస్టెంట్ల నియామకం, వాచ్‌మెన్ పోస్టుల భర్తీ, భోజన వర్కర్లను నియామకం వంటి చర్యలు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీనిపై స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్, మండల కమిటీ నేతలు రవి, జోసెఫ్, శ్రీను, అభిషేక్, అనిల్, దాదాపు 1500మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పంటపొలాల్లోకి జారిపడిన బండరాళ్లు

బండరాళ్ల బ్లాస్టింగ్‌లతో పంటలకు నష్టం

ప్రజాశక్తి -అనంతగిరి : కొత్తవలస, కిరండూల్ కేకే లైన్ రెండవ లైన్ పునరుద్ధరణ పనుల్లో భాగంగా చిమిడిపల్లి స్టేషన్ సమీపంలో జరుగుతున్న బ్లాస్టింగ్ పనులు వల్ల పొలాల్లో భారీ బండరాళ్లు ఎగిరి ప్రాంతం నుంచి వచ్చిపడి పంటలకు తీవ్రనష్టం కలుగజేస్తున్నాయని గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు. తమ వ్యవసాయ భూములకు ఆనుకొని రెండవ కె.కె.లైన్ పనులు జరుగుతున్నాయని, దీనికోసం చేపట్టిన బ్లాస్టింగ్ పనులు, అనంతరం ప్రొక్లెయిన్ లతో బయటకు తీసిన బండరాళ్లు తమ వ్యవసాయ పంటలపై జారిపడి నష్టానికి గురి చేస్తున్నాయని గిరిజనులు చెందిన గడిచేల. లచ్చయ్యతో పాటు పదిమంది రైతులు ఆవేదన చెందుతున్నారు. తక్షణమే సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి, పంటలకు వాటిల్లిన నష్టాలకు పరిహారం ఇవ్వాలని కోరారు.

దాబుగూడ క్వార్ట్జ్ మైనింగ్ తవ్వకాలు ఆపాలి

-కూటమి ప్రభుత్వం ముమ్మర యత్నాలు మానుకోవాలి

- నేడే మైనింగ్‌కు వ్యతిరేకంగా బహిరంగ సభ

క్వార్ట్జ్ మైనింగ్ నిల్వలున్న దాబుగూడ కొండ

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: మండలంలోని మాదల పంచాయతీ తోటవలస, దాబుగూడ మధ్యలో క్వార్ట్జ్ మైనింగ్ తవ్వకాలకు టిడిపి కూటమి ప్రభుత్వం ముమ్మర యత్నాలను వ్యతిరేకిస్తూ ఈనెల 6న ఆదివాసీగిరిజన సంఘం ఆధ్వర్యంలో దాబుగూడలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఆదివాసీల జీవనం, వారి మనుగడను ప్రశ్నార్థకం చేసే మైనింగ్ తవ్వకాలకు వ్యతిరేకంగా చేపట్టే ఆందోళన సభలో పెద్దఎత్తున గిరిజనులు పాల్గొని విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు పిలుపునిస్తున్నారు.

2019లోనే దాబుగూడలో మైనింగ్‌కు ప్రతిపాదించగా, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేయడంతో గత ప్రభుత్వం వెనక్కుతగ్గింది ఇపుడు టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామసభ, పెసా, 1/70 చట్టాలను తుంగలో తొక్కి తవ్వకాలు చేయాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది మైనింగ్‌కు వ్యతిరేకంగా అనేక రూపాల్లో గిరిజనులు ఆందోళనలు చేస్తున్నా, పాలక ప్రభుత్వాలు తమ ప్రయత్నాలను మానుకోవడం లేదు. మైనింగ్ తవ్వకాల కోసం గత వైసిపి ప్రభుత్వం మాదల పంచాయితీ పరిధిలోని 21 గ్రామాల్లో గ్రామసభ అనుమతి లేకుండా దొంగ సంతకాలు పెట్టించి బలవంతంగా మైనింగ్ చేపట్టాలని యత్నించింది. దాబుగూడ పరిసర గ్రామాల ప్రజలకు భయభ్రాంతులకు గురిచేసి, ఆదివాసీ ప్రజల మధ్య తగువులు పెట్టి, చీలికలు చసి, వారి ఐక్యతను దెబ్బతీసే విధంగా తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం మోకాలడ్డంతో వారి ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఇపుడు అదే బాటలో టిడిపి ప్రభుత్వం కూడా మైనింగ్‌కు ప్రయత్నాలు చేస్తోంది. దాబుగూడలో మైనింగ్ తవ్వకాలు వలస కాలుష్యం పెచ్చురిల్లి గుండె, ఊపిరితిత్తులు జబ్బులతో ప్రజలతోపాటు మూగజీవులకు నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు, నిపుణులు చెబుతున్నారు. ఏజెన్సీలో అటవీ ఉత్పత్తులు, పండించే పంటలకు తీవ్రమైన ప్రభావం చూపి పర్యావరణం విధ్వంసమయ్యే పరిస్థితి వుంది.గాలి దుమ్ము దూళి ప్రభావంతో పచ్చమైన అడవి నాశనమౌతుంది. కొండ చుట్టుపక్కల నుండి వెళుతున్న ఊటగడ్డల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న మాదాల పంచాయితీ గ్రామాలైన తోటవలన, దాబుగుడ, పొట్టంగిపాడు, సరుబెడ్డ, రత్తగూడ, దోమలజోరు, రర్తకండి, తుంగగడ్డ, కమలతోట ఈ గ్రామాల ప్రజలకు ఈ మైనింగ్ తవ్వకాలు వలన నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది..దాబుగూడ కొండ చుట్టుపక్కల ఉన్న భూములు తోటవలస, దాబుగుడ, పోట్టంగిపాడు, రత్తగుడ, సరూబెడ్డ పంట పొలాలు భూములు, మిరియాలు, కాఫీ తోటలు, వంట పొలాలు పచ్చని అడవి నాశనమవుతుందని ఆవేదన వ్యక్తమౌతోంది..దాబుగూడ కొండ తవ్వకాలు చేపట్టితే ఆంధ్ర, ఒరిసా సరిహద్దు రాష్ట్ర ప్రజలు తీవ్రంగా నష్టం జరుగుతుంది. ఈ నేపథ్యంలో పీసా చట్టం, 1/70 చట్టాన్ని ధిక్కరించి మా కొండ జోలికి వస్తే సహించేది లేదని తరిమి తరిమి కొడతామని ఈ ప్రాంత ఆదివాసులు హెచ్చరిస్తున్నారు. మైనింగ్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఈనెల 6న దాబుగుడ కొండపైన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు తెలిపారు.ఈ సభకు వేలాది మంది తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టేందుకు ఆదివాసీలంతా సంఘటితం కావాలని, దీనికి సన్నద్ధతగా బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

మైనింగ్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నగిరిజనులు (ఫైల్‌ఫొటో)

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

హౌసింగ్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బాబూనాయక్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ప్రధానమంత్రి జన్‌మన్ యోజన పథకం కింద గృహ నిర్మాణం పనులు వేగంగా చేయాలని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ బి బాబూనాయక్ సూచించారు. మంగళవారం మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ పెద్దగంగగుడి, కొత్త బల్లుగూడ పంచాయతీ పరిధి గ్రామంలో గృహ నిర్మాణ పనులను అరకులోయ ఎఇఇ శెట్టి కాంతి ఆధ్వర్యంలో సందర్శించి, పరిశీలించారు.ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి బాబూనాయక్ మాట్లాడుతూ, అరకులోయ మండల వ్యాప్తంగా నూతనంగా 2166 గృహాలు మంజూరయ్యాయన్నారు. నిరుపేద పీవీటీజిలకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన్మన్ యోజన పథకం క్రింద ఒక్కో ఇంటి నిర్మాణానికి 2లక్ష 39 వేల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు.

జన్‌మన్ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ

పనితీరు మార్చుకోండి!

- ఆశ్రమ ఉపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్లకు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అభిషేక్ హెచ్చరిక

- మెనూలో నిర్లక్ష్యం వహించిన డిప్యూటీ వార్డెన్‌కు షోకాజ్

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్లు పనితీరు మార్చుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ హెచ్చరించారు. మీరు మారరా? అంటూ ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని కిల్లోగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సోమ, మంగళవారాల్లో మెనూలో ఏం పెట్టారని అడిగి తెలుసుకున్నారు. వంకాయ కూరకు బదులు బంగాళదుంప కూర పెట్టారని విద్యార్థులు చెప్పారు. సాయంత్రం రాగి మాల్ట్, స్నాక్స్ పెట్టలేదని విద్యార్థులు వివరించారు. విద్యార్థులకు నిర్దేశించిన నాణ్యమైన మెనూ అందించలేదని డిప్యూటీ వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాగి పిండి లేకపోతే బయట కొనుగోలు చేయాలని ఎందుకు కొనుగోలు చేయలేదని ప్రశ్నించారు. సహాయ గిరిజన సంక్షేమ అధికారులు ఆశ్రమ పాఠశాలను తరచూ తనిఖీ చేసి మెనూ అమలు చేయడానికి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థుల తెలుగు, ఇంగ్లీష్ విద్యా ప్రమాణాలు పరిశీలించి ప్రధానోపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బేస్ లైన్ పరీక్షల ప్రకారం విద్యార్థులను ఏబిసిడి గ్రూపులుగా విభజించి సిడి గ్రూపులో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. మెనూ సక్రమంగా అమలు చేయలేదని డిప్యూటీ వార్డెన్ కె.బాలికి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. గిరిజన విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని సూచించారు. ఆశ్రమ పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారని ఆరా తీశారు. విద్యార్థులు ఎవరైనా జ్వరాలతో ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపెట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఎల్ రజిని పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఐటిడిఎ పిఒ అభిషేక్

ఆదివాసీ యువతకు న్యాయం చేయండి

ప్రజాశక్తి -పాడేరు: త్వరలో ప్రభుత్వం నిర్వహించనున్న డిఎస్‌సిలో ఆదివాసి యువతకు పూర్తి న్యాయం చేయాలని వైసిపికి చెందిన ఎమ్మెల్సీ కుంభ రవిబాబు అరకు ఎంపీ డాక్టర్ తనూజ రాణి, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మంగళవారం పాడేరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జీవో నెంబర్ 3 పునరుద్ధరణ జరగకుండా డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రభుత్వం ఇస్తే ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు మంగళవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ ఆందోళనను వెలిబుచ్చి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. గత ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు అరకులోయ ఎన్నికల బహిరంగ సభలో ఆదివాసీలకు జిఒ 3 పునరుద్ధరిస్తామని స్వయంగా హామీ ఇచ్చారని, దీనిపై ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ఆరోపించారు.

జిఒ 3కు ప్రత్యామ్నాయం చేయకుండా ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే గిరిజన యువతకు అండగా పోరాటం సాగిస్తామన్నారు. జిఒ3 పునరుద్ధరణకు సుప్రీంకోర్టు ఉత్తర్వులు అడ్డు అయితే, దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఇది ప్రభుత్వం చేతిలో ఉందనిస్పష్టం చేశారు. జిఒ3 ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో నూరు శాతం ఉద్యోగ అవకాశాలు గిరిజన అభ్యర్థులకు కల్పించకుండా డిఎస్‌సి గిరిజన యువతకు అన్యాయం జరిగితే ముమ్మాటికి ఆ పాపం కూటమి ప్రభుత్వానిదే అవుతుందని హెచ్చరించారు.

మాట్లాడుతున్న వైసిపి ప్రజాప్రతినిధులు

వెయ్యి ఎకరాలకు మల్బరీ సాగు విస్తరణ

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : జిల్లా వ్యాప్తంగా వెయ్యి ఎకరాల్లో మల్బరీ సాగు విస్తరించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. మైక్రో ఇరిగేషన్, సెరీ కల్చర్, టూరిజం, స్వయం ఉపాధి పథకాలు యూనిట్లు మంజూరు, ఆర్థిక చేకూర్పు కల్పనపై సంబంధిత అధికారులతో అభివద్ధి కార్యక్రమాల అమలుపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏడాదికి పది విడతల్లో పట్టు పరుగుల నుండి రైతులకు సుమారు రూ.లక్ష ఆదాయం వస్తోందన్నారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటిడి ఏ పరిధిలో మల్బరీ సాగు, పట్టుపురుగుల పెంపకాన్ని విస్తరించి రైతులకు ఆదాయం పెంచడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా పది వేల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ తోటలు పెంపకాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. నిర్దేశించిన లక్ష్యాలను అధిగ మించి రైతులకు పెద్ద ఎత్తున మైక్రో ఇరిగేషన్ యూనిట్లు మంజూరు చేయాలని సూచించారు. పోషకాహార లోపం ఉన్న చిన్నారులపై ఐసిడిఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. బాల్య వివాహాల నిర్మూలన పై ప్రజలను చైతన్యవంతం చేయాలని చెప్పారు. సంబంధిత రికార్డులు నిర్వహించాలని పేర్కొన్నారు.

కిశోర వికాసం పథకంలో బాల, బాలికలకు క్రీడలు నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. లక్పతి దీదీ పథకంలో లబ్దిదారులకు స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేయాలని ఎల్టి ఎంను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాలలో ట్రాఫిక్, పారిశుధ్యం, భద్రతా చర్యలు పేపట్టాలని సూచించారు. పర్యాటక ప్రదేశాల పరిధిలో గ్రామ స్థాయి, మండల స్థాయి, ఐటిడి ఏ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయమని చెప్పామని ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకున్నారని అధికారులను అడిగి తెలుసు కున్నారు. పర్యాటక సర్క్యూట్ల ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో పర్చువల్గా పాడేరు, రంపచోడవరం, చింతూరు పి.ఓలు వి.అభిషేక్, కె. సింహచలం, అపూర్వ భరత్, మైక్రో ఇరిగేషన్ పి.డి. రహీమ్, ఐసిడి ఎస్ పిడి సూర్య లక్ష్మి, డి.పి.ఓ, బి.లవరాజు, రహదారులు భవనాల శాఖ ఇఇ బాల సుందర బాబు, సిపిఓ ఎస్. ఎస్. ఆర్.కె. పట్నాయక్, ఎల్ ఎం మాతునాయుడు, సెరీ కల్చర్ ఎడి అప్పారావు, జిల్లా పర్యాటక అధికారి జి.దాసు, డ్వమా పి.డి. శివయ్య గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇ ఇ జవహార్ కుమార్ పాల్గొన్నారు.

విలేకరికి పలువురి పరామర్శ

ప్రజాశక్తి - చింతపల్లి : కాళ్లకు వచ్చిన నరాల సంబంధిత సమస్యకు ఇటీవల హైదరాబాద్‌లో శస్త్ర చికిత్స చేయించుకుని రెండు రోజుల క్రితం చింతపల్లి చేరుకున్న చింతపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేశెట్టి సత్యనారాయణ (సతీష్)ను టిడిపి అరకు పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, రీమల ఆనందరావు పరామర్శించారు. ఈ సందర్భంగా సతీష్ కాళ్లకు సోకిన సమస్యకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే చింతపల్లి పాత్రికేయులు కూడా సతీష్‌ను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సతీష్ ను పరామర్శించిన వారిలో షేక్ నాగూర్‌ఉన్నారు.

వైద్య సిబ్బంది, ఆశాలతో సమావేశం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ఖాదర్ మస్తాన్ వల్లి అధ్యక్షతన ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి మాట్లాడుతూ శిశువులు పెరుగుదల, ఆరోగ్యం, వారికి సంక్రమించే న్యూమోనియా వ్యాధి నియంత్రణపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించుకోవాలన్నారు. కుటుంబ నియంత్రణలో తాత్కాలిక పద్ధతులు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారికి సకాలంలో అందించవలసిన పోషకాహారాలపై అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. హెచ్‌బిఎన్‌సి, హెచ్‌బివైసి, ఐఎంఎన్‌సిఐ) వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఆశా యాప్‌ను వినియోగించి అర్హులైన దంపతులను గణన చేయాలన్నారు. గర్భవతులు వాడాల్సిన ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు గురించి విటమిన్ ఏ మాత్రల గురించి ఆశాలకు వివరించారు. హెచ్‌బిఎన్‌సి, హెచ్‌బివైసి, విహెచ్‌ఎస్‌ఎన్‌డి కమిటీలను జాగృతం చేయాలని కోరారు. గర్భవతులు ప్రసవం సమయంలో రుగ్మతాలను, డెలివరీ అనంతరం రుగ్మతాలను పరిశీలించి వైద్యాధికారి దృష్టికి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయుష్ విభాగం డాక్టర్ జి.రవికుమార్ మాట్లాడుతూ సాధారణ వ్యాధులతో పాటు మధుమేహం వ్యాధి నియంత్రణలో ఆశా కార్యకర్తలు అనుసరించవలసిన పాత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కే.జోజిబాబు, ఆరోగ్య పర్యవేక్షకులు త్రినాధరావు, బాలామణి, ఆరోగ్య కార్యకర్తలు రాజబాబు, అంగనాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పద్మాపురం గార్డెన్ సుందరీకరణను 15లోగా పూర్తి చేయాలి

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఆదేశం

ప్రజాశక్తి- అరకులోయ: పద్మాపురం గార్డెన్ సుందరికీకరణ పనులు వేగవంతం చేసి, ఈనెల 15లోగా పూర్తి చేయాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ ఆదేశించారు. పర్యాటకులను మరింతగా ఆకర్షించే విధంగా సుందరంగా తీర్చిదిద్దాలని, అవసరమైన నిధులు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. మంగళవారం పద్మాపురం గార్డెన్‌ను సందర్శించారు. గార్డెన్ లోపల సిసి రోడ్డును పరిశీలించి పలు సూచనలు చేశారు. మరుగుదొడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, మరుగుదొడ్లు బయటకు కనబడకుండా వ్యూకట్టర్ ఏర్పాటు చేయాలన్నారు. పార్కులో విద్యుద్దీపాలను, హాట్ ఎయిర్ బెలూన్‌కు ఫెన్సింగ్, దాని నిర్వాహకులకు ప్రత్యేకంగా షెడ్డు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ఇఇ కె.వేణుగోపాల్, ఎఇఇ అభిషేక్, పద్మాపురం గార్డెన్ మేనేజర్ బొంజు బాబు, హాట్ ఎయిర్ బెలూన్ నిర్వాహకులు గట్ల సంతోష్ పాల్గొన్నారు.

అధికారులకు సూచనలు చేస్తున్న ఐటిడిఎ పిఒ అభిషేక్

గిరిజన ప్రాంత నిరుద్యోగులకు మెగా డిఎస్‌సి శాపం కాకూడదు

ప్రజాశక్తి -జి.మాడుగుల: గిరిజన ప్రాంతంలోని నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో జారీ చేయనున్న మెగా డిఎస్‌సి శాపం కాకుండా చూడాలని జిఒ3 సాధన కమిటీ జిల్లా సహాయ కార్యదర్శి మత్స్యరాస నారాయణరావు కోరారు. పాడేరు పర్యటనకు వచ్చిన రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవిలను పాడేరు పిఎంఆర్‌సి వద్ద గిరిజన డిఎస్‌సి అభ్యర్థులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరాజు మాట్లాడుతూ జిఒ 3కు చట్టబద్ధత కల్పించకుండా, దాని ప్రయోజనాలను గిరిజన ప్రాంత నిరుద్యోగులకు వర్తించేలా ఉత్తర్వులు జారీ చేయకుండా ఈనెల 6న మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేస్తే మన్యంలోని డిఎస్‌సి అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వెలిబుచ్చారు. ఏజెన్సీలో 95 శాతం మంది గిరిజన అభ్యర్థులు ఉన్నారని,ఈ పరిస్థితుల్లో గిరిజన ప్రాంత ఉద్యోగాలు స్థానిక అభ్యర్థులకు పూర్తిస్థాయిలో దక్కే పరిస్థితి ఉండదన్నారు.

దీనిపై ఎమ్మెల్యే శిరీషాదేవి స్పందిస్తూ, జిఒ3కు ప్రత్యామ్నాయ ఉత్తర్వుల కోసం అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి, ఏజెన్సీలోని నిరుద్యోగ గిరిజనులకు అండగా ఉంటానన్నారు. మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ మెగా డిఎస్‌సిలో నోటిఫై చేయనున్న 16,347 పోస్టుల్లో 2024 పోస్టులు గిరిజన ప్రాంత అభ్యర్థులకే చెందుతాయని, తద్వారా గిరిజన అభ్యర్థులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దాన్నేటిపలసి.శంకర్, మహేశ్, సూర్య, వెంగడసురేష్ బాబు, కిరసాని కిషోర్, బోయిన అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కోటిరెడ్డికి సిపిఎం నేతల ఘన నివాళి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని కల్తూనూరు గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ సభ్యులు, తొలి తరం కార్యకర్త కెచ్చల కోటిరెడ్డి (78) సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు మృతి చెందారు. కోటిరెడ్డి మృతదేహంపై సిపిఎం నాయకులు ఆ పార్టీ జెండాను కప్పి, పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సోయం చినబాబు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ కరుడు కట్టిన కార్యకర్తగా కోటిరెడ్డి పార్టీలో చాలా చురుగ్గా పనిచేశారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు మూర్ల యర్రయ్య రెడ్డి, కుంజా బొజ్జ, సున్నం రాజయ్య అనుచరుడిగా కోటిరెడ్డి ఉండేవారని పేర్కొన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం పార్టీ ఏ పిలుపు ఇచ్చినా ఎంతో నిబద్ధతతో అమలు చేసేవారని కొనియాడారు. కోటిరెడ్డి ఆశయాలను కార్యకర్తలు ముందుకు తీసుకెళ్లాలని, అప్పుడే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కోటిరెడ్డి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి కుటుంబ సభ్యులకు పార్టీ తరపున ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలియజేశారు. అనంతరం బంధువులు, పార్టీ సభ్యులు, నాయకులు కోటిరెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు తొడం రాజులు, గుండెపూడి లక్ష్మణరావు, కమ్మిచిచ్చు సత్యనారాయణ, వార్డు సభ్యులు ధారయ్య, నాయకులు ఆత్మకూరు కాంతారావు, మాజీ సర్పంచ్ పులి ధర్మరాజు, కదల కొండారెడ్డి, స్థానిక సిపియం నాయకులు కెచ్చెల వీరపురెడ్డి, వల్ల రవీంద్రరెడ్డి, అందేలా కన్నపురెడ్డి, వల్ల సత్యనారాయణరెడ్డి, కండ్ల ధర్మరాజురెడ్డి, కొమరం శేఖర్, కెచ్చులా ఆదినారాయణ రెడ్డి, కదల నర్సిరెడ్డి, అందెల సూరపురెడ్డి, వాళ్ళ గోపాల్ రెడ్డి, మాజీ వార్డు మెంబర్ విద్దే సీతమ్మ, వల్ల లక్ష్మి, కెచ్చేల సాయికుమార్ రెడ్డి, భూపతిరెడ్డి, కెచ్చెల చంబు రెడ్డి, గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటిరెడ్డి పార్థివదేహం

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో ప్రజలు మంగళవారం నాగుల చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక మారెమ్మ అమ్మవారి ఆలయంలోని నాగేంద్రుని గుడిలోనూ, ఆలయ ప్రాంగణంలో వెలసిన పుట్టలలో భక్తులు పాలు పోసి పూజలు నిర్వహించారు. అనంతరం మారెమ్మ అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. **చింతపల్లి** : నాగుల చవితి పర్వదినాన్ని భక్తులు పుట్టల వద్ద ఉత్సాహభరిత వాతావరణంలో జరుపుకున్నారు. **డుంబ్రిగుడ** : పుట్టల్లో పాలు పోసి, గుడ్లు పెట్టి టపాసులు పేలుస్తూ భక్తిశ్రద్ధలతో మండల వాసులు పూజలు చేశారు.

నేటి నుంచి జల ఉత్సవం

జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశం మేరకు ఈనెల 6 నుంచి 20 వరకు జిల్లాలోని మండల కేంద్రాలు, అన్ని గ్రామపంచాయతీల్లోనూ జల ఉత్సవం ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం రాత్రి పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, డిఆర్‌డిఎ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నీటి వనరుల సంరక్షణలో స్థానిక సంఘాల భాగస్వామ్యం కీలకమైనదన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో నీటి భద్రత, పరిరక్షణ, నైపుణాభివృద్ధితో యాజమాన్య భావాన్ని పెంపొందించి, శాశ్వత నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మొదటి రోజు నుండి చివరి రోజు వరకు షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొనాలని ఆదేశించారు. జల సంరక్షణ, నీటి లభ్యత, తాగునీటి పథకాలు శుభ్రం చేయడం, క్లోరినేషన్ పనులు చేపట్టాలన్నారు. సచివాలయం సిబ్బంది, మహిళా సంఘాలు, స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయడంతోపాటు పాఠశాలల విద్యార్థులు జల ఉత్సవంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ జవహర్‌కుమార్, డిపిఒ బి. లవరాజు, డి.ఆర్‌డిఎ పీడీ వి.మురళి, డ్వామా పీడీ ఎం.శివయ్య, డిఎంహెచ్‌ఒ డాక్టర్ జమాల్ భాషా, డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్.కుమార్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-జి మాడుగుల : మండలంలోని సొలభం పంచాయతీ తాసరుబయలు గ్రామంలో 100 మీటర్ల డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ ఐసారం హనుమంతరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు సోమేలి చిట్టిబాబు మాజీ ఎంపీపీ వెంకట గంగరాజు టిడిపి నాయకులు రామరాజు, పిన్నయ్య గ్రామస్తులు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి - చింతపల్లి : చింతపల్లి, జీ కే వీధి మండలాలలోని వివిధ పంచాయతీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కొమ్మంగి, గొందిపాకల వైసిపి మండల కన్వీనర్ పాంగి గణబాబు, పెదబరడ, గొందిపాకల, జికె వీధి మండలం దామనాపల్లి ఎంపిటిసి సభ్యులు పొట్టిక లోవరాజు, తాంబేలి మోహ,రావు, జీకే వీధి మండలం ఎంపీటీసీ కొర్ర భీమారావు కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జి.సుభద్రను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించారు. వాటి పరిష్కారంతోపాటు మండలంలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించిన సమస్యల పరిష్కారానికి జిల్లా పరిషత్ నుంచి నిధులు కేటాయించి మన్య ప్రాంత అభివద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. వైసిపినాయకులు గణబాబు, బెన్నా స్వామి.ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలలో డిడి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -జి మాడుగుల: మండల కేంద్రంలో గాంధీనగర్ ఆశ్రమ పాఠశాలలో పాడేరు ఇన్‌ఛార్జి డిడి రజిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని, వ్యాధులు పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు. భోజన శాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు అనారోగ్య సమస్యలు వస్తే, వెంటనే సమీప హాస్పిటల్‌కు తరలించి, వైద్యసేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పాడేరు నుంచి వచ్చిన వైద్యులతో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : మారేడుమిల్లి మండలం సున్నంపాడు గ్రామానికి చెందిన భూసారపు శ్రీదేవి అనే ఆదివాసి మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ట్రైబల్ రైట్స్ ఫొరం రాష్ట్ర అధ్యక్షుడు మూడవతు విష్ణు నాయక్ డిమాండ్ చేశారు. రంపచోడవరం స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధిత మహిళ భూసారపు శ్రీదేవి మాట్లాడుతూ అక్కిన బాలకృష్ణ అనే వ్యక్తి కులం పేరుతో దూషిస్తూ తన ఇంటికి వచ్చి తనపై దాడి చేశారని తెలిపారు. దీనిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. తన దాడి చేసి బాలకృష్ణపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు హత్యాయత్నం కేసు కూడా నమోదు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పల్లాల రాజ్ కుమార్‌రెడ్డి, కుర్ల రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.